01ATP27_01ATP27.qxd 27-07-2024 PM 10:21 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 28 జులై 2024 పేజీలు : 04


# పంచాయితీ నిధులు.. పంచాయితీకే దక్కాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

- గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయితీలు నిర్వీర్యం అయ్యాయి
- వారి నిధులు వారికే వచ్చేలా కృషి చేస్తాను.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- విజయవాడ పంచాయితీ రాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశాల్లో పాల్గొన్న దగ్గుపాటి

**అనంతపురం అర్బన్, జులై 27 ప్రభాతవార్త**

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఆర్థిక సంఘం నిధులు పంచాయితీలకే దక్కాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సమావేశాలు విజయవాడలో నిర్వహించగా, ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకర్, పంచాయితీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎన్నికల అనంతరం నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సమావేశ: కావడంతో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో దగ్గుపాటి మాట్లాడుతూ.. పంచాయితీ రాజ్ ఛాంబర్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. 2014 ఎన్నికల తర్వాత తాను ఎ ంపిపిగా ఎన్నికైన తర్వాత జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆరోజు నుంచి గ్రామల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని, అప్పట్లో ఎంపిపిల సంఘం స్టేట్ జనరల్ సెక్రెటరీగా పని చేశానని వివరించారు. తాను ఎమ్మెల్యే అయ్యానంటే ఇందుకు పంచాయితీరాజ్ ఛాంబర్ కృషి ఉందన్నారు. గత వైసీపి ప్రభుత్వంలో గ్రామాలకు, పంచాయితీలకు ఏ నిధులు వచ్చినా పక్కదారి పట్టించారన్నారు. అందుకే గ్రామాల్లో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో కచ్చితంగా పంచాయితీలకు పెద్ద ఎత్తున నిధులు వస్తాయని, ఆ నిధులు పంచాయితీలకే దక్కాలన్నారు. దీనిపై తాను ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా మాట్లాడుతానన్నారు. భవిష్యత్ పంచాయితీ రాజ్ ఛాంబర్ ఎలాంటి అవసరం ఉన్నా.. తన వంతు పాత్ర పోషిస్తున్నన్నారు. అనంతరం రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబర్ తరపున నూతనంగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకర్‌ని పంచాయితీ రాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలోకమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిరు ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వాసుపల్లి లక్ష్మి, ముత్యాలరావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల క ృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్‌నాయుడు, ఇస్మాయిల్, అనంతపురం జిల్లా పంచాయితీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వేలూరు రంగయ్య, ఉమ్మడి సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్, సర్పంచుల సంఘం నాయకులు మాజీ ఎంపిపి వీరేష్, ముత్యాలప్ప నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతితినిధి సాకే లక్ష్మినరసింహా తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం హౌసింగ్ ఏఈ బాలాజీ ఆత్మహత్య యత్నం

**ధర్మవరం, జులై 27 ప్రభాతవార్త**

అధికార వేదింపులు తాళలేక హౌసింగ్ ఏఈ బాలాజీ ఆత్మహత్య యత్నం చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాల మేరకు.. ధర్మవరం మున్సిపాలిటీ హౌసింగ్ ఏఈగా పని చేస్తున్న అన్నం బాలాజీ అధికారుల వేదింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. విధులలో భాగంగా కార్యాలయానికి వెళ్లి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు బాటిల్ తీసుకొని అక్కడే తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. తోటి ఉద్యోగులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారాన్ని పోలీసులకు చేరవేయగా వారు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. తన కుటుంబ సభ్యులు, తాను ఎందుకు ఆత్మహత్యయత్నం పాల్పడిన విషయం వీడియోల ద్వారా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హౌసింగ్ ఏఈ బాలాజీ భార్య వనిత మాట్లాడుతూ.. హౌసింగ్ పడీఈ మరో కిందిస్థాయి ఉద్యోగులు తరచూ ఏ కారణము లేకుండా వేదించే వారని, హౌసింగ్ పిడి శంకర్ లాల్ భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిడి కార్యాలయంలో పని చేసే మరో కింది స్థాయి ముగ్గురు ఉద్యోగులు కూడా ఏదో ఒక రకంగా బాలాజీ.. నీవు ధర్మవరంలో ఉండకూడదంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేసే వారని భార్య తెలిపింది. చివరికి వీరి వేదింపులు తాళలేకే నా భర్త బాలాజీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, నా భర్తకు ఏమైనా అయితే పూర్తి బాధ్యత వారే వహించాలని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రులు నారాలోకేస్, సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం జరిగేంత వరకు తాను పోరాడుతానని తెలిపారు. తన భర్త ఆత్మహత్యయత్నానికి పాల్పడే విధంగా వేధించిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఏఈ బాలాజీ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హౌసింగ్ ఏఈ బాలాజీ

# నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి స్కందన్ కార్తికేయ పేరు నమోదు చేయడం గర్వకారణం: జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్



చిన్నారిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**రాయదుర్గం, జూలై 27 ప్రభాతవార్త:**

నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి స్కందన్ కార్తికేయ పేరు నమోదు చేయడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఐఏఎస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండల పరిధిలోని గోనబావి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి బి.శాంతి, హేమంత్‌కుమార్ కుమారుడు 4నెలల 19రోజుల చిన్నారి ఎస్.కె.స్కందన్ కార్తికేయ ఫ్లాష్ కార్డ్‌లను(వెజిటబుల్స్, కలర్స్, అనిమల్స్, ఫ్రూట్స్, బర్డ్స్, వెహికల్స్, షేప్స్, ఫ్రీడమ్ ఫైటర్స్ లాంటివి) గుర్తించడంలో అతి చిన్న వయస్సు చిన్నారిగా నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసింది. శనివారం అనంతపురంలోని కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో చిన్నారి స్కందన్ కార్తికేయతో కలిసి తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌ని కలిశారు. చిన్నారిని గుడ్ అంటూ జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారిని సాధారణ అబ్బాయిలా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. భవిష్యత్తులో కూడా చిన్నారికి ప్రోత్సాహం అందించాలన్నారు. చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ 244 ఫ్లాష్ కార్డ్‌లను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి స్కందన్ కార్తికేయ పేరు నమోదు చేశారన్నారు. ఈ నెల 18వ తేదీన నోబెల్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి సర్టిఫికేషన్ రావడం జరిగిందని తెలిపారు. తమ చిన్నారిని అభినందించడం పట్ల జిల్లా కలెక్టర్‌కి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

- త్వరలోనే ఇదే అంశంపై ముఖ్యమంత్రిని, వ్యవసాసయ శాఖ మంత్రిని కలుస్తాం
- పండ్ల తోటల పెంపకం పరిమితిని 5 ఎకరాల నుంచి 10 ఎకరాకలు పెంచాలి - రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త బ్యూరో**

ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటే.. పెట్టుబడులు పెరిగి భారంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడమే సరైన పరిష్కారమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభిప్రాయ పడ్డారు. ఇదే అంశాన్ని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుచాలా సార్లుచెప్పారని గుర్తు చేశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురు రైతులు పరిటాల సునీతను కలిసి నేటి వ్యవసాయ పరిస్థితుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పెట్టుబడులు తగ్గిస్తేనే వ్యవసాయం మనుగడ సాధ్యమవుతుందన్నారు. అనంతపురం లాంటి క రువు జిల్లాలో రైతులను ఆదుకునేందుకు ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్లతోటల పెంపకాన్ని చేపడుతున్నారన్నారు. ప్రస్తుతం ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. అయితే అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది 5 నుంచి 10 ఎకరాల వరకు భూములు ఉన్న రైతులే ఉన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పండ్ల తోటల పెంపకం పథకాన్ని 10 ఎకరాలలోపు రైతులకు కూడా వర్తింపచేయాలన్నారు. పరిమితిని పది ఎకరాలకు పెంచితే ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యంత తక్కువ వర్షపాతం ఉన్నందున రైతుల్ని ఉద్యాన పంటల వైపు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జిల్లాలో సంప్రదాయ పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టాలు మూట కట్టుకుంటున్నారన్నారు. పండ్ల తోటల సాగు ఎక్కువ పెట్టుబడితో కూడుకున్నది కాబట్టి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మన ప్రభుత్వంపై ఉందన్నారు. పరిమితిని పది ఎకరాలకు పెంచడం ద్వారా లక్షలాది మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పది ఎకరాల వరకు అర్హతను పెంచి 5 ఎకరాల్లో పండ్ల మొక్కలు పెంపకానికి అవకాశం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఇదే అంశాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి వివరిస్తామని సునీత అన్నారు.



మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

# జిల్లాలో సజావుగా ఇసుక పంపిణీ

## జుంజురాంపల్లి వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్...



ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**రాయదుర్గం రూరల్, జూలై 27 ప్రభాతవార్త:**

జిల్లాలో సజావుగా ఇసుక పంపిణీ చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఐఏఎస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని జుంజురాంపల్లి గ్రామం వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక పంపిణీకి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాలేదన్నరు. జిల్లాలో ఉన్న ఒకే ఒక స్టాక్ యార్డు జుంజురాంపల్లి స్టాక్ యార్డు అని, అక్కడ దాదాపు 56వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిలువ చేసే అవకాశం ఉండగా, ఇప్పటికి 40వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. ఉచిత ఇసుక కార్యక్రమం కింద ఇసుక రీచ్ నుంచి డిపో వరకు ఇసుకను తేవడం, లోడింగ్ చార్జీలు మరియు రాయల్టీ(సీనరేజ్)చార్జీలు మొత్తం కలిపి ఒక మెట్రిక్ టన్ను ఇసుక రూ.195కు అందిస్తున్నామన్నారు. ఇసుక పంపిణీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అందుబాటులో ఉందని, ఇంటర్‌స్టేట్ అందుబాటులో ఉండదన్నారు. అన్ని శాఖల అధికారులు, పోలీస్ శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ కలిసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇసుక పంపిణీ చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇసుక సరఫరాకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా మైన్స్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో ఇంటి నిర్మాణానికి ఇసుకను ఉపయోగించడం జరుగుతోందని, ఇక్కడి నుంచి కర్నూలు జిల్లాలోని పత్తికొండ, శ్రీ సత్యసాయి జిల్లాలోని అమరాపురం వారు ఇసుకను తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. జిల్లాలో స్టాక్ యూర్డులను, కొత్తగా ప్రతిపాదనలు పంపించిన ఇసుక రీచ్‌లను తనిఖీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఇసుక స్టాక్ నమోదు చేసే రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి ఎక్కడెక్కడ వరకు ఇసుక సరఫరా చేస్తున్నారు, ఎంత బాడుగ వసూలు చేస్తున్నారు, ఇసుక నాణ్యతగా ఉందా, ప్రతి రోజు ఎన్ని లోడ్‌లను పంపిస్తున్నారు తదితర వివరాలను ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ డిడి నాగయ్య, సీఐ శ్రీనివాసులు, తహసీల్దార్ చిట్టిబాబు, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, పంచాయితీ సెక్రెటరీ అశోక్‌కుమార్, విఆర్‌ఓ భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లా ఎస్పీని కలిసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురంజిల్లా ఎస్పీ మురళీ కృష్ణ నగరంలోని పోలీస్ విశ్రాంతి భవనంలో శనివారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, పివికెకె కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్‌రెడ్డి, కేరళ మాజీ డిజిపి శంకర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంత జిల్లాకు నూతన జిల్లాకు విచ్చేసిన జిల్లా ఎస్పీ మురళీ కృష్ణ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్‌పల్లె రఘునాథరెడ్డిలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంత జిల్లాకు ఎస్పీగా రావడం తాను అదృష్టంగా భావిస్తున్నానని అందరి సహకారంతో ప్రజలకు జవాబుదారీగా పని చేద్దామని జిల్లాఎస్పీ ఈ సందర్భంగా వారితో పేర్కొన్నారు.

ఎస్పీని సన్మానిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పివికెకె కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ →



# పీఏబీఆర్‌కు 300 క్యూసెక్కుల నీరు విడుదల

- టీడీ డ్యాం నుండి సరిహద్దులో 888 క్యూసెక్కుల నీరు - రేపు గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు విడుదల కానున్న నీరు

**ఉరవకొండ, జూలై 27 ప్రభాతవార్త**

మండల పరిధిలోని మోపిడి గ్రామంవద్దగల లింక్ ఛానల్ నుండి పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు 300 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు నుండి తుంగభద్ర జలాలు శుక్రవారం రాత్రికి పీఏబీఆర్ లింక్ ఛానల్ చేరిన విషయం తెలిసిందే. కర్నాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయం నుండి రాష్ట్ర సరిహద్దు బోమ్మనహాల్ మండలం 105 కిలోమీటరువద్ద కాలువలో 888 క్యూసెక్కుల నీరు వస్తుండగా చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు నుండి 500 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది. ఈ సందర్భంగా హెచ్ఎల్‌సీ డీఈఈ మద్దిలేటి ప్రభాతవార్తతో మాట్లాడుతూ కాలువ నీటిని మొత్తం పీఏబీఆర్‌కు మళ్లించడం జరుగుతోందన్నారు. తాగునీటి అవసరాలు మోదటి ప్రాధాన్యతగా పీఏబీఆర్‌ను పూర్తీ సామర్థ్యంతో నింపడం జరుగుతుందన్నారు. సోమవారం నుండి జీబీసీ (గుంతకల్లు బ్రాంచి కెనాల్)కు నీటిని విడుదల చేస్తామన్నారు. ఐఏబీ (ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశంలో చర్చించిన అనంతరం ఆయకట్టుకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు. ఇదిలావుండగా కర్నాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయం పూర్తీ నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 100.054 టీఎంసీలు (1631.56 అడుగులు) నీరు నిల్వ ఉండగా ఎగువ నుండి 1,17,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా కాలువలకు 8,895 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెళుతోంది. కాగా డ్యాం భద్రత దృష్ట్యా 1,10,943 క్యూసెక్కుల నీటిని దిగువకు నదిలోకి విడుదల చేస్తున్నారు.



మోపిడి గ్రామంవద్దగల లింక్ ఛానల్ నుండి పీఏబీఆర్‌కు వెళుతున్న తుంగభద్ర జలాలు

# సమగ్రశిక్ష ఇన్‌చార్జ్ ఏపీసీగా డీఈవో...!

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ - ఇన్‌చార్జ్ బాధ్యతలు నుంచి తప్పించుకోవడానికి డీఈవో ప్రయత్నం
- గత వారం రోజులుగా ఏపీసీ పోస్టు ఖాళీ - ఎక్కడికక్కడే ఆగిపోయిన పలు ఫైల్స్ - అయోమయంలో సమగ్రశిక్ష ఉద్యోగులు

**అనంతపురం న్యూటౌన్, జూలై 27 ప్రభాతవార్త**

**సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఇన్‌చార్జ్ (ఏపీసీ)గా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) బి.వరలక్ష్మికి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. కానీ డీఈవో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకోకుండా ఆ బాధ్యతలు నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండటం గమనార్హం.**

అనంతపురం జిల్లా సమగ్రశిక్ష రెగ్యులర్ ఏపీసీగా జె.వర ప్రసాద్‌రావు పనిచేస్తూ మేలో పదవీ విరమణ పొందారు. అప్పుడు ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఈవో బి.వరలక్ష్మికి అప్పగిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ డీఈవో ఎస్పీడీ ఉత్తర్వులు బేఖాతర్ చేస్తూ ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించకుండా...ఏడీ నాగరాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించేలా జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపించడం జరిగింది. అయితే ఏడి కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు తనకు వద్దని చెప్పడంతో మళ్లీ కలెక్టర్‌కు ఫైల్ పంపించడం జరిగింది. దీంతో కలెక్టర్ డీఈవో తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి ఏపీసీ (ఎఫ్ఏసీ)గా అప్పటి జెడ్పీ సీఈవో మైఖోమ్ నదియా దేవికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఏపీసీ, జెడ్పీ సీఈవోను ప్రభుత్వం వారం రోజుల క్రితం రాజంపేట సబ్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. దీంతో గత వారం రోజులుగా ఏపీసీ పోస్టు ఖాళీగానే వుంది. ఇన్‌చార్జ్ బాధ్యతలు కోసం సమగ్రశిక్ష కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపించడం జరిగింది. అయితే జిల్లా కలెక్టర్ ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఈవోకు అప్పగిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న డీఈవో ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు నుంచి తప్పించుకోవడానికి గత రెండు రోజులుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. గతంలో కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు డీఈవోకు అప్పగిస్తే అప్పుడుకూడా ఆబాధ్యతలు తీసుకోకుండా తప్పించుకోవడం జరిగింది. ప్రస్తుతం కూడా అలాంటి ప్రయత్నాలే చేస్తున్నారు. ఏపీసీ లేక గత కొన్నిరోజులుగా ఫైల్స్ ఎక్కడికక్కడే ఆగిపోయాయి. అందులో ముగ్గురు ఉద్యోగులు రిఫ్యాట్రేషన్‌కోసం లెటర్ పెట్టుకున్న ఫైల్ దాదాపు రెండునెలలకు పైగా పెండింగ్‌లోనే వుంది. అలాగే రిఫ్యాట్రేషన్ అయిన ఐఈడీ కోఆర్డినేటర్‌ను రిలీవ్ చేయాల్సిన ఫైల్, వెహికల్ బిల్లుకు సంబంధించిన ఫైల్,టిఎ,డిఎలకు సంబంధించిన ఫైల్,ఇలా చెప్పుకుంటూపోతే చాలాఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం విద్యాసంవత్సరంకూడా ప్రారంభం అయింది. ఇలాంటి పరిస్థితుల్లో డీఈవో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతర్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సమగ్రశిక్ష కార్యాలయం డీపీసీగా కొనసాగుతున్న డీఈవో గత కొన్ని రోజులుగా ఆకార్యాలయంవైపు కన్నెతి చూడటంలేదని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఇక వారంరోజులుగా ఏపీసీపోస్టు ఖాళీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు తమకు పెద్ద బాస్ (డీఈవో) తర్వాత చిన్న బాస్ (ఏపీసీ) ఎవరో తెలియక అయోమయానికి గురవుతున్నారు. అయితే ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఈవో స్వీకరిస్తారా?లేదా? అన్నది వేచి చూడాల్సిందే.



సమగ్రశిక్ష కార్యాలయం



**ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు తనకే అప్పగించారు : డీఈవో బి.వరలక్ష్మి**

సమగ్రశిక్ష ఏపీసీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ తనకే (డీఈవో) ఇచ్చారు. అయితే తనకు ఇన్‌చార్జ్ బాధ్యతలు వద్దని కలెక్టర్‌ను రిక్వెస్ట్ చేసుకుంటున్నాను.

## త్వరలో రూ.5 రూపాయలకే ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ భోజనం - దేవినేని ధర్మతేజ

**- పూజా కార్యక్రమంతో పున: ప్రారంభమైన ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ భవన నిర్మాణం పనులు**

**కళ్యాణదుర్గం టౌన్, జులై 27 ప్రభాతవార్త**



ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం శాసనసభ్యులు శ్రీ అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ నాయకులు దేవినేని ధర్మతేజ, రాహుల్ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ భవన్‌లో గల స్వర్గీయ ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గం కేంద్రమైన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ముందు అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులను తెలుగుదేశం పార్టీ నాయకులు, మహాశక్తి మహిళా సభ్యుల చేతుల మీదుగా పూజా కార్యక్రమంలో భవన పున: నిర్మాణ పనులను ప్రారంభించారు. త్వరలోనే రూ.5 రూపాయలకు పేదలకు భోజనం అందిస్తామని, త్వరగా భవన నిర్మాణం పనులను పూర్తి చేసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేలా ప్రణాళికలు చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, స్టోర్ డీలర్లు, పట్టణ మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మహాశక్తి మహిళా సభ్యులు, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## భారత దేశపు IIవ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం 9వ వర్ధంతి

**- నివాలులు అర్పించిన దేవినేని ధర్మతేజ**



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, జులై 27 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ ప్రజా వేదిక కార్యాలయంలో భారతదేశపు 11వ రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతి సందర్భంగా దేవినేని ధర్మతేజ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతదేశపు 11వ రాష్ట్రపతిగా, క్షిపని శాస్త్రవేత్తగా, భారతర్న అవార్డు గ్రహీత, మిస్సైల్ మ్యాన్ ఏపిజే అబ్దుల్ కలాంని వారు భారతదేశంను ఉన్నతమైన స్థానంలో నిలబెట్టి వారిగా, దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డి.శర్మష్‌వలి, మండల అధ్యక్షులు గొల్ల వెంకటేషులు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులురెడ ఇడ, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, రెహమాన్, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు, స్టోర్ డీలర్లు, మున్సిపల్ వార్డు ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

## అభివృద్ధే ఆయన మంత్రం

**- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో మున్సిపాలిటీ సర్వే..**

**కళ్యాణదుర్గం టౌన్, జులై 27 ప్రభాతవార్త**



సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీర్లు

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్దే తన మంత్రంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగానే మున్సి పాలిటీలో అన్ని వార్డుల్లో ఆయన వ్యక్తిగత ఇంజినీర్లతో మున్సిపాలిటీలో సర్వే ప్రారంభించారు. ఎక్కడ సిసి రోడ్లు అవసరం, డ్రైనేజ్ ఎక్కడ అవసరం ఇంకా ఏమి చేస్తే మున్సిపాలిటీలో భాగుంటుంది అని పలు రకాలుగా సర్వేలు చేయిస్తున్నారు. ఈ సర్వే గత 15 రోజుల నుంచి వార్డుల వారీగా సర్వే చేసి రిపోర్టు ఎమ్మెల్యేకి ఇస్తున్నారు. సర్వే రిపోర్టు మొత్తం వచ్చాక స్థానిక నాయకులతో కలిసి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కార్యచరణ చేయనున్నారు.

## బృహత్తర ప్రణాళికతో మున్సిపాలిటీ అభివృద్ధి..- దేవినేని అవినాష్



సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

**కళ్యాణదుర్గం టౌన్, జులై 27 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ బృహత్తర ప్రణాళికలతో ముందుకెళ్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు, మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రజా వేదిక కార్యాలయంలో శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు సూచనలతో మున్సిపాలిటీలోని మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, తాజా కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అందరు సూచనలు, సలహాలు తీసుకుని ఒక బృహత్తర ప్రణాళికతో అభివృద్ధికి చేయడానికి మీ సహకారం, కృషి అవసరమని ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులను కోరారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం...

**రాయదుర్గం రూరల్, జూలై 27 ప్రభాతవార్త:**

స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వృక్షశాస్త్రం మరియు వాణిజ్యశాస్త్రం అతిథి అధ్యాపక పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రాఘురామమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వృక్షశాస్త్రము-1, వాణిజ్యశాస్త్రము-1 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందుకు గాను అర్హతలు కలిసిన పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ)లో 55% ఉత్తీర్ణత కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నెట్(ఎన్ఈటి), సెట్(ఎస్ఈటి), పిహెచ్‌డి(పిహెచ్‌డి) విద్యార్హతలు కలిగి ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను సమర్పిస్తూ ఈ నెల 29 సోమవారం ఉదయం 11.30గంటలకు కళాశాలలో మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ)కు హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

## సర్వసభ్య సమావేశం నిరవధిక వాయిదా

**- సభ్యులందరూ గైర్హాజరు - కోరం లేక మూడు నెలల తరువాత నిర్వహిస్తామన్న ఎంపిడిఒ**

**చిలమత్తూరు, జూలై 27 ప్రభాతవార్త**



సభ్యులు గైర్హాజరవడంతో బోసిపోయిన మండల మీట్ హాల్

చిలమత్తూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్ప ఎంపిటిసిలు హాజరుకాకపోవడంతో నిరవధికంగా సమావేశాన్ని వాయిదా వేస్తూ మరో మూడు నెలల తరువాత సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపిడిఒ రామ్‌కుమార్ తెలిపారు. సభ్యులందరూ గైర్హాజరు కాకపోవడంతో కోరంలేక ఇలాంటి ప్రకటన చట్టం మేరకు తెలియాల్సి వచ్చిందన్నారు. ఇదిలా వుండగా సర్వసభ్య సమావేశ నిర్వహణంలో అల్లర్లు ఘటనలు జరిగే అవకాశం వుందని ముందే ఊహించిన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించి చర్యలు తీసుకున్నారు. బందోబస్తు పర్యవేక్షణలో డిఎస్‌పి కంజాక్షన్, రూరల్ సిఐ ఈరన్న, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 5 మంది ఎంపిటిసిలు టిడిపిలోకి చేరిక

**- గతంలో నలుగురు ఎంపిటిసిలు టిడిపిలో చేరికతో 9 చేరిన ఎంపిటిసిల సంఖ్య- కోడూరు సర్పంచు, సింగిల్‌విండోలు సహా పార్టీలో చేరిక - అభివృద్ధి ఆకాంక్షిస్తూ పార్టీలోకి వచ్చామని తెలిపిన సభ్యులు**



టిడిపిలో చేరిని వైసిపి ఎంపిటిసిలు

**చిలమత్తూరు, జూలై 27 ప్రభాతవార్త**

మండలంలో ప్రజాపరిషత్ పాలక వర్గం విషయంలో గట్టి దెబ్బ వైసిపికి తగిలింది. ఉత్కంఠ నడుమ జరగాల్సిన మండల మీట్‌కు హాజరుకావాల్సిన ఎంపిటిసిలు హాల్‌కు హాజరవ్వకుండా ఏకంగా టిడిపి కండువాలు వేసుకుని సభ వాయిదా అనంతరం ఎంపిడిఒ కార్యాయలం వద్దకు రావడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారింది. గతంలో వైసిపి నుండి టిడిపిలోకి నలుగురు ఎంపిటిసిలు రావడం, తాజాగా శనివారం మరో ఐదు మంది ఎంపిటిసిలతో పాటు కో ఆప్షన్ మెంబర్, కోడూరు సర్పంచు మురళి, కోడూరు సింగిల్‌విండో అధ్యక్షులు హనుమంతరెడ్డిలు టిడిపి తీర్థం పుచ్చుకోవడం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపిటిసిలు, ఇతరులు చేరడంపై టిడిపి మండల అధ్యక్షులు రంగారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ఆకాంక్షిస్తూ పార్టీలోకి రావడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని, పాదర్శక పాలనను నమ్మి ఎంపిటిసిలు చేరారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అనూష, నాయకులు నాగరాజుయాదవ్, అశ్వర్థప్ప, లక్ష్మినారాయణయాదవ్, సోము, బాలాజీ, అంజినప్ప, బేకరి గంగాధర్, తిప్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలి

**- డిప్యూటీ తహాశీల్దారుకు వినతిపత్రం సమర్పించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు**

**కంబదూరు, జూలై 27 ప్రభాతవార్త**



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు

కంబదూరులోని ప్రభుత్వ కళాశాలతోపాటు రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ శనివారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నేతలు రీ సర్వే డిప్యూటీ తహాశీల్దారు గణేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా కంబదూరు జూనియర్ కళాశాలలో ఎంపిపి విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నానరు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వెంకటేషులు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు సాయి, హర్ష, మోహన్‌రెడ్డి, మనోజ్ ఇతర విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

## తహాశీల్దారు నిత్యానంద బాబు బదిలీ

**కంబదూరు, జూలై 27 ప్రభాతవార్త**



తహాశిల్దారును సన్మానిస్తున్న దృశ్యం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన తహాశీల్దారు తమ సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కంబదూరు మండల తహాశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న నిత్యానందబాబు శనివారం చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కంబదూరు మండల రీ సర్వే డిటి గణేష్, విఆర్‌ఓలు ఇతర రెవెన్యూ సిబ్బంది తహాశీల్దార్‌ను ఘనంగా సాన్మనించారు. నూతన తహాశీల్దార్ వచ్చే వరకు డిప్యూటీ తహాశీల్దార్ లేదా రీ సర్వే డిటిలు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

## కర్ణాటక మద్యం స్వాదీనం...

**డి.హీరేహాళ్, జూలై 27 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సోమలాపురం గ్రామ శివారుల్లో కర్ణాటక నుండి అక్రమంగా మద్యంను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం సోమలాపురం గ్రామం వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా బొమ్మనహాళ్ మండలంలోని ఏలంజి గ్రామానికి చెందిన బర్మప్ప అనే వ్యక్తి కర్ణాటక నుండి అక్రమంగా 75టెట్రా ప్యాకేట్లు తీసుకువస్తుండగా అతన్ని పట్టుకుని మద్యంను సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 24వ రైల్వే గేటు మూసివేత...

**డి.హీరేహాళ్, జూలై 27 ప్రభాతవార్త:**



మూసివేసిన రైల్వే గేటు ఫైల్‌ఫోటో...

మండల పరిధిలోని సోమలాపురం గ్రామం వద్ద ఉన్న లెవెల్స్ క్రాసింగ్ 24వ గేటును ఈ నెల 30వతేదీ(మంగళవారం) మూసివేయనున్నట్లు నైరుతి రైల్వే బళ్లారి సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రుద్రేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గేటు వద్ద ఓవర్ హోల్డింగ్, వార్షిక నిర్వహణ మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు ఈ అంతరాయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## టిడిపి సీనియర్ నాయకుడు అనారోగ్యంతో మృతి

**- నివాళి అర్పించిన కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు**

**బ్రహ్మసముద్రం, జులై 27 ప్రభాతవార్త**



మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన దృశ్యం

మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు తలారి చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు టిడిపి బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, బ్రహ్మసముద్రం మండలం జడ్పిటిసి ప్రభావతి బ్రహ్మసముద్రం గ్రామానికి చేరుకుని తలారి చంద్రశేఖప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం చంద్రశేఖప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి టిడిపి పార్టీ ఎల్ల వేళల కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మసముద్రం గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహాశీల్దారును సన్మానించిన టిడిపి కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు

**బ్రహ్మసముద్రం, జులై 27 ప్రభాతవార్త**



తహాశీల్దార్ ఈశ్వరయ్యను సన్మానిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో తహాశీల్దార్ కార్యాలయంలో కడప జిల్లా నుంచి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీపై వచ్చిన గత 6 నెలలుగా సమర్థవంతంగా విధులు నిర్వహించి నేడు కడప జిల్లాకు తిరిగి దిలీపై వెళ్తున్న తహాశీల్దారు ఈశ్వరయ్యను మండల టిడిపి కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు పూల మాల వేసి శాలువాతో సత్కరించడం జరిగింది. అదే విధంగా తహాశీల్దార్ కార్యాలయం సిబ్బంది. డిప్యూటీ తహాశీల్దార్ శ్రీనాథరెడ్డి, డిటి కృష్ణ ఆర్ఐ న ఆగిరెడ్డి, విఆర్‌ఓలు సర్వేయర్లు కార్యాలయం సిబ్బంది ఈశ్వరయ్య సత్కరించారు. గత ఆరు నెలులగా విధులు నిర్వహించి సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేఖ విధులు నిర్వహించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, డిప్యూటీ తహాశీల్దారులు శ్రీనాథరెడ్డి, కృష్ణా ఆర్ఐ నాగిరెడ్డి విఆర్‌లు, సర్వేయర్లు విఆర్‌ఎలు కార్యాలయం సిబ్బంది పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మిత్రుని జ్ఞాపకార్థం అనాధలకు దుస్తులు పంపిణీ

**గుత్తి, జూలై 27 ప్రభాతవార్త**



అనాధలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తమ మిత్రుడు మృతి చెంది 13 సంవత్సరాలు అయినప్పటికి అతని జ్ఞాపకార్థం మిత్రబృందం అనాధలకు దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టింది. పట్టణానికి చెందిన బివి గంగాధర్ జ్ఞాపకార్థం ఆరోగ్యమిత్ర బాబు ఆధ్వర్యంలో శనివారం కొత్తూరులోని అనాధాశ్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప 60 మంది వృద్ధులు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. స్నేహానికి ప్రతిరూపంగా మిత్రబృందం సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏటా రక్తదాన శిబిరాలు, దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపడుతూ తమ స్నేహబంధాన్ని చాటుతున్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు రవి, రాము, విజయ్, హుసేన్‌వలి, వరప్రసాద్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కౌన్సిలర్ ఆగ్రహం

**- తీరుమార్చుకోవాలంటూ కౌన్సిల్‌లో నిలదీత**

**- ఊహించని పరిణామంతో బిక్కమొహం వేసిన అధికారి**

**గుంతకల్లు, జూలై 27 ప్రభాతవార్త**



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ మాణిక్యమ్మ

శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిపై 19వవార్డు కౌన్సిలర్ మాణిక్యమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరుమార్చుకోవాలంటూ కౌన్సిల్‌లో నిలదీశారు. ఊహించని పరిణామంతో ఆ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బిక్కమొహం వేయాల్సి వచ్చింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశపు భవనంలో చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించార. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాణిక్యమ్మ మాట్లాడుతూ తన వార్డులో పనిచేసే స్వీపర్ సుజాతను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వార్డులో పనిచేసే నలుగురు కార్మికులను కాలనీలో కాకుండా వేరే పనికి పురమాయిస్తుండడంతో కాలనీలో శానిటేషన్ లోపిస్తోందన్నారు. కార్మికులను కులం పేరుతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్మికులు అయినప్పటికి వారికి కూడా ఆత్మగౌరం వుంటుందని వారిని గౌరవించి మాట్లాడాలని కోరారు. ఎన్నిమార్లు ఫోన్లు చేసినా ఆయన స్పందించరని అసహనం వ్యక్తం చేశారు. వార్డులో పనిచేయడానికి జెసిబిని అడిగితే అడిగిన సమయానికి కాకుండా ఆయనకు ఇష్టం వచ్చినప్పుడు పంపిస్తారని పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన చైర్‌పర్సన్ భవాని కౌన్సిలర్ ప్రజల చేత ఎన్నుకోబడి వార్డు ప్రజలకు జవాబుదారిగా వుంటారని కావునా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని మరోమారు ఇలాంటివి పురావృతం కాకుండా చూడాలని సూచించారు. అంతకుముందు కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుటుంబాలతో బైకుపై వెళ్లే వారి పరిస్థితి మరీ దారుణంగా వుందని కుక్కలు వెంటబడితే గాయాల పాలుకావాల్సిందేనన్నారు. అలాగే కౌన్సిలర్ వై.సుధాకర్ మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లకు 8 నెలలకుపైగా వేతనాలు ఇవ్వలేదని వారి పరిస్థితి దారుణంగా వుందన్నారు. ఇంటర్, డిగ్రీలుచదువుకుని ఏ ఉద్యోగం లేక డ్రైవర్‌గా పనిచేస్తున్నారని అధికారులు ఏజెన్సీతో మాట్లాడి వేతనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై స్పందించిన కమీషనర్ వెంకటరమణయ్య త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషర్ లావణ్య, మున్సిపల్ ఎంఇ గుర్రప్పయాదవ్, డిఇలు హేమచంద్ర, ఆర్ఒ నాజీర్‌హుసేన్, మెప్మా ప్రాజెక్ట్ అధికారి మోహన్, సిటీ ప్లానర్ సత్తార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నేడు అందుబాటులో విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రం

**గుత్తి, జూలై 27 ప్రభాతవార్త**

విద్యుత్‌బిల్లులు చెల్లించేందుకు 28నఆదివారం ఆఖరి గడువు ముగుస్తున్న నేపథ్యంలో వినియోగదారుల సౌకర్యార్థం డివిజన్ వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల చెల్లింపుకేంద్రాలను అందుబాటులో వుంచినట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు. ఆయా మండల, పట్టణ ప్రాంతాల్లో వున్న విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో సెలవురోజు సైతం తమ బిల్లులు చెల్లించేందుకు అందుబాటులో వుంచామన్నారు. బిల్లులపై సర్‌చార్జ్ భారం పడకుండా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## కన్నుల పండువగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

**ఉరవకొండ, జూలై 27 ప్రభాతవార్త**



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం ఆషాడ సప్తమి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చి ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పించాలి

**-ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొండంనాటి ప్రశాంత్**

**-యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి నియామకం**

**ఉరవకొండ, జూలై 27 ప్రభాతవార్త**



రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొండంనాటి ప్రశాంత్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పించి నిధులు కేటాయించాలని ఆర్ఎస్‌యూ (రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొండంనాటి ప్రశాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆర్ఎస్‌యూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అధ్యక్షతన జరుగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొండంనాటి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ హాసట్లళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని దానివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత సంవత్సరం 10 నెలలపాటు విద్యార్థులకు ఇవ్వాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోగా కనీస సౌకర్యాలను కూడా కల్పించలేదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం 2 నెలల మెస్ చార్జీలను విడుదల చేయడం సంతోషకరమని మిగిలిన 8 నెలల మెస్ చార్జీలు కూడా విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిపై చర్యలు తీసుకోవాలని, వారికి వంత పాడుతున్న విద్యాశాఖలోని అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు. తల్లికి వందనం పథకం కింద చదువుకొంటున్న ప్రతి విద్యార్థికీ ఆర్థిక సాయం అందిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పడం హర్షనీయమన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకోసం నిధులు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్ళలో ఖాళీగావున్న వార్డెన్, వాచ్‌మెన్, కుక్, కమాటీ పోస్టులతోపాటు పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం ఆర్ఎస్‌యూ ముందుండి నడిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా చీరంజీవిను నియమించారు.

## వ్యాపారాన్ని, జీవనోపాధులను దెబ్బతీస్తున్న మార్వాడీలను నిలువరించండి

**-తహాశీల్దార్, పంచాయతీ కార్యదర్శికు విన్నవించిన బిల్డింగ్ నీడ్స్, హోమ్ నీడ్స్ అసోసియేషన్**

**ఉరవకొండ, జూలై 27 ప్రభాతవార్త**



డిప్యూటీ తహాశీల్దార్ హరినాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యాపారులు

వ్యాపారాన్ని, జీవనోపాధులను దెబ్బతీస్తున్న మార్వాడీలను (రాజస్థాన్ రాష్ట్రం వారు) నిలువరించాలని ఉరవకొండ పట్టణానికి చెందిన బిల్డింగ్ నీడ్స్, హోమ్ నీడ్స్ అసోసియేషన్ కోరింది. శనివారం అసోసియేషన్ మండల తహాశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహాశీల్దార్ జి.హరినాథ్, మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌లకు ఈ మేరకు వినతిపత్రాలు అందించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పి.రవి, కార్యదర్శి ఎన్.కె.గోపి, కోశాధికారి కె.జయనరసింహప్రసాద్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తాము వ్యాపారము చేసుకొని జీవనం గడుపుతున్నామని మా వ్యాపారం మీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువత కూడా ఉద్యోగాలు లేక రుణాలు తీసుకొని వ్యాపారాలు చేసుకొంటోందని అయితే ఈ మధ్య కాలంలో ఎక్కడో రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుండి వచ్చిన మార్వాడీలు ప్రతి వ్యాపారంలోకి చొరబడి ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తూ వ్యాపారాన్ని, జీవనోపాధులను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్వాడీలు వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులు మంజూరు చేయకుండా నిలువరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు, వ్యాపారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని రైల్వే కార్మికుల ధర్నా

**గుత్తి, జూలై 27 ప్రభాతవార్త**

కార్మికుల ఆరోగ్య సంరక్షణ రీత్యారైల్వే హెల్త్ యూనిట్‌లో అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం దక్షిణమధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. భోజన విరామ సమయంలో రైల్వే ఆసుపత్రి వద్ద పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక కార్మికుడు అంబులెన్స్ సౌకర్యం లేక మృతి చెందాడని శుక్రవారం పరంధామ అనే కార్మికుడు గుండెపోటుకు గురైనప్పటికీ అంబులెన్స్ సౌకర్యం లేక సకాలంలో చికిత్సకు నోచుకోక మృతి చెందాడని వారు ఆరోపించారు. 18 నెలలుగా అంబులెన్స్ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ ఎడిఎస్ నారాయణ, చైర్మన్ నరసింహ, శేఖర్‌బాబు, మనోహర్, ప్రసాద్‌రెడ్డి, రాంనాయక్, బ్రాంచ్ కార్యదర్శి రామాంజనేయరెడ్డి, కార్మికులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



రైల్వే కార్మికులు ధరా చేస్తున్న దృశ్యం

# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ ఈబి దేవి



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న ఈబి దేవి

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి**

అనంతపురం పట్టటణంలోని వినాయక నగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి దేవి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందిస్తున్న ఓబి సేవలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను, అన్ని రకాల వైద్య సేవల రికార్డులను పరిశీలించడం జరిగింది. వైద్య అధికారి, సిబ్బంది సమయపాలన పాటించాలని, పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధజలో పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని తగు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పట్టణ ఆరోగ్య కేంద్రం పరపిధజలో ఉన్న అన్ని రనకాల రెసిడెని ్యయల్ సందర్శించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే అనంత ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా మొక్కలు పెంచాలని వైద్య అధికారి డా.సుస్మితాను, ఇతర సిబ్బందిని ఆదేశించారు.

# కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న అనంత యువకులు



అవార్డును అందుకుంటున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జులై 27 ప్రభాతవార్త**

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ డిజిటల్ ఇండియా విభాగం మై గవర్నమెంట్ అవార్డులను అనంతపురం యువకులు బిసాతి భరత్ మై గవ్ అంబాసిడర్ అవార్డు, బిసాటి జీవన్ కుమార్ మై గవ్ సాతి అవార్డులు ఈ రోజు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ చేతుల మీదుగా ఢిల్లీలోని ఇండియా హాబిటెడ్ సెంటర్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మై గరవ్నమెంట్ స్థాపించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మై గవ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం యొక్క పథకాలను అనగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన ప్రధాన మంత్రి భీమ యోజన క్యాష్ లెస్ ఇండియా, డిజిలాకర్, ఉమంగ్ యాప్ ఆత్మ నిర్బర్ భారత్, మేరి మట్టి మేరా దేశ్, అజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను గత పది సంవత్సరాలుగా అనంతపురం జిల్లాలోని యువతకు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బిసాతి భరత్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా మేము చేసిన సేవలకు గుర్తించి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈరోజు అవార్డులు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది అని పేర్కొన్నారు.

# మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించాలి




నిరసన తెలియజేస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జులై 27 ప్రభాతవార్త**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పునః ప్రారంభించాలని ఇంటర్మీడియెట్ ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. కరు వుకు నిలయంగా ఉన్న అనంతపురం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులు ఎక్కువ మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యను అభ్యసించేటువంటి విద్యార్థులు అందరూ కూడా అర్థాకలితో విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ప్రధానంగా ఈ జిల్లాలో ఏర్పడింది. గత ప్రభు త్వం రద్దు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం వల్ల వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దూరమయ్యారన్నారు. ఇప్పటికైనా స్పందించి జూనియర్ కళాశాల సమస్యల పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు తరిమేలగిరి, సిద్దు జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు సోము, గణేష్, మహేష్, సాయి, వరుణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



జీపు జాత పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జులై 27 ప్రభాతవార్త**

ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఆగస్టు ఒకటో తేది నుంచి జిల్లాలో జీపు జాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈరోజు స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమణయ్య కుల్లాయిస్వామి మాట్లాడుతూ.. విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని అనంతపురంలో ప్రారంభమైన నార్పల తాడిపత్రి గుత్తి, గుంతకల్, ఉరవకొండ కణేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడు వరకు ఏఐఎస్ఎఫ్ జీపు జాత మూడు రోజులపాటు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజినేయులు, నగర అధ్యక్షురాలు మంజునాథ్, ఉమా మహేష్, నాయకులు రాధాజ్యోతి, హర్షనాని, చైతన్య జాన్ హర్షవర్ధన్ కిషోర్, శంకర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

# అండర్-14 క్రికెట్ అబ్బాయిల ఎంపికలు

**అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27,ప్రభాతవార్త**

అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అండర్-14 బాలుర ఎంపికలు ఆగస్ట్ 4 జరుగును. 2024-25 సీజన్ కోసం జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక ఆటస్ట్ 4న ఉదయం 9 గంటలకు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్నాము. అబ్బాయిలు 31-08-2012 - 01-09-2010 మధ్య జన్మించిన వారు ఎంపికలకు అర్హులు. అసక్తిగల వారు పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, స్వంత క్రికెట్ కిట్ మరియు వైట్ యూనిఫాంతో రావాలని తెలియజేశారు.

# పామిడిని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- ప్రభుత్వ ఆధాయానికి గండికొడితే చూస్తూ ఊరుకోం
- టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్



ఈఓఆర్‌డి శశికళతో చర్చిస్తున్న ఈశ్వర్, గంగిరెడ్డి కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

**పామిడి, జులై 27 ప్రభాతవార్త**

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూనే పామిడిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొనా ్నరు. పామిడి అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించిన టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ శనివారం పట్టణంలో నెలకొన్న సమస్యలు.. అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకుని టిడిపి శ్రేణులతో కలిసి గంగిరెడ్డి కాలువను పరిశీలించారు. పెద్దకాలువ, గంగిరెడ్డి కాలువల ఆధునీకరణ, ఎద్దులపల్లిరోడ్డు, మెయిన్‌రోడ్డు, బిసిసి రోడ్ల విస్తరణ, బిసిసి రోడ్డులో విధు ్యత్ స్తంబాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఎక్కడెక్కడ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి, ఆక్రమణల తొలగింపు, గ్రామీణ ఉపాధిహామి పథకం పనులు ఇతరత్ర అంశాలపై ఈఓఆర్‌డి శశికళతో చర్చించారు. ప్రభుత్వ ఆధాయానికి గండి కొడితే ఎంతటివారైనా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం షాధీఖానాలో ముస్లిం సోదరులు నిర్వహించిన సమావేశాన్ని గుమ ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. మాకు స్మశాన వాటిక కోసం 2 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ముస్లిం సోదరులు విన్నవించగా అధికారులతో సంప్రదించి స్థలాన్ని కేటాయించ టానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరుల సమస్యలను పరిష్కరిస్తూ వారి అభు ్యన్నతికి పాటుపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్.ఆర్.రమేష్, జింకల సంజీవకుమార్, గౌస్‌ఫీర, మహమ్మద్‌రఫీ, కొట్టం మాలిక్, బొమ్మా మోహన్ పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న తహాశీల్దారుకు సన్మానం



తహాశీల్దారు సోబన్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

**శింగనమల, జులై 27 ప్రభాతవార్త**

మండలకేంద్రంలోని తహాశీల్దారు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న తహాశీల్దారు సోబన్‌బాబును రెవెన్యూ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా కడప జిల్లా నుంచి బదిలీపై శింగనమల తహాశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సోబన్‌బాబు, ఎన్నికలు ముగిసిన పిమ్మట బదిలీపై తిరిగి తన సొంత జిల్లా కడపకు వెళ్తున్న సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పూల బొకేను అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దారు ప్రకాష్‌రావు, మండల సర్వేయర్ గోవిందరాజులు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, విఆర్‌ఓలు సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆస్కార్ రావు అసత్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు గోపికృష్ణ, రాముNaయక్

**అనంతపురం న్యూటౌన్, జులై 27 ప్రభాతవార్త**

ఏపిఈజిఏ నుంచి బహిష్కరణ గురైన మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కారరావు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపిఈజిఏ జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామునాయక్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 22న విజయవాడలోని ఏపిజిఈఏ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలతో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపిజిఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఆస్కార్‌రావుని తొలగిస్తూ తీర్మానం చేసి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శిలు సంతకాలు చేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఆస్కార్ రావు ప్రధాన కార్యదర్శి పదవిని కోల్పోయారన్నారు. అలా కార్యవర్గ సభ్యులతో సంఘం నుంచి బహిస్కరింపబడిన ఆస్కార్‌రావు, గతంలో బహిష్కరణకు గురై, శ్రీకాంత్ రాబ్‌తో కలసి శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంఘం నుంచి సూర్యనారాయణని బహిష్కరణ చేస్తున్నామని పత్రిక ప్రకటన ఇవ్వడం అవివేకమని, దీనిని అనంతపురం జిల్లా శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంఘం నుంచి బహిష్కరణకు గురై సంఘంలో ఎలాంటి పదవులలో లేని ఆ ఇరువురితో ఏపిజిఈఏకు సంబంధించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కానీ, ఏ ఒక్క జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కానీ లేరన్నారు. ఈ విషయం తెలిసినా కూడా సంఘాన్ని, ఉద్యోగులను తప్పుదోవ పట్టించేలా వీరిద్దరూ అధ్యక్ష, కార్యదర్శిలుగా ప్రకటించుకుని, పత్రిక ప్రకటనలు ఇవ్వడం, వాళ్ల అవగాహన రాహిత్యాన్ని, అజ్ఞానాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ అసత్య ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

# జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



ఆపరేషన్‌లో పాల్గొన్న వైద్య బృందం, తొలగించిన గడ్డను చూపుతున్న డాక్టర్ రమణానాయక్

**శింగనమల, జులై 27 ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. రాయదుర్గం తాలూకా గుమ్మగట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన రంగప్ప, భార్య నర్సక్క గత ఐదు సంవత్సరాల నుంచి కడుపు నొప్పితో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని అనేక ప్రైవేట్ ఆసుపత్రి చుట్టూ చికిత్సకు తిరిగినా చికిత్సకు వైద్యులు ముందుకు రాలేదు. చివరకు జిల్లా కేంద్రంలో ని సర్వ జన ఆసుపత్రిలో శస్త్ర చికిత్స వైద్యులు డాక్టర్ రమణనాయక్ పరీక్షించి ఆపరేషన్ చేయాలని చేర్చుకున్నారు. ప్రొఫెసర్ హెచ్‌ఓడి రామస్వామినాయక్ అసోషియేట్ ప్రొఫెసర్ ఉజ్జనేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రమణనాయక్ బృందం కలిసి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్ అనంతరం 15 రోజుల తర్వాత రోగిని ఇంటికి పంపడం జరిగింది. దాదాపు 3 గంటల పాటు డాక్టర్ రామస్వామి, డా.రమణనాయక్‌లు శ్రమించి 5 కెజిల గడ్డను తొల గించారు. ఈ ఆపరేషన్‌లో మత్తుమందు డాక్టర్ హరికృష్ణ, పిబిజిలు డా.రమ్య, డా.విశాల్, డా.అబిలాష్, స్టాఫ్ నర్సు సునీత, ఓటి అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఆరంబ్ 2024




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఏపిఎస్‌సి హెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎస్ఆర్ఐటి సలహాదారు ఈఎస్ చక్రవర్తి , కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

**శింగనమల, జులై 27 ప్రభాతవార్త**

విద్యార్థులు ఒక మంచి కళాశాలను ఎన్నుకుని చేరడంతోనే తమ బాధ్యత తీరిపోయిందని అనుకోకుండా చేరిన మొదటి రోజు నుంచే కళాశాలలో గడప వలసిన నాలుగు సంవత్సరాలు ప్రతి విషయాన్ని నేర్చుకుంటూ అంకిత భావంతో పని చేస్తూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేసుకునే బాధ్యత విద్యార్థులదేనని మాజీ ఏపిఎస్‌సిహెచ్‌ఈ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయ సముద్రం మండలంలోని శ్రీనివాస రామానుజన్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 2024-25 కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రుల కోసం ఏర్పాటు చేసిన ఆరంబ్-2024 కార్యక్రమం కళ్శాశాల ప్రాంగణమంతా విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అతిథులతో కళాశాల సిబ్బందితో కలకల లాడుతూ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఏపిఎస్‌సి హెచ్‌ఈ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి కళాశాల యాజమాన్యం సిబ్బంది అందించే అన్ని అద్భుత అవకాశాలను చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ సమయాన్ని వృథా చేయకుండా చదివే అలవాటును పెంపొందించుకుంటూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యార్థుల్లోని బలాలు, బలహీనతలు అవకాశాలు, భయాలను అన్నింటినీ అధిగమించి ఎదుర్కొని ముందుకు సాగాలని ప్రోత్సహించి ఉత్సాహ పరిచారు. అనంతరం ఎస్ఆర్ఐటి సలహాదారు ఈఎస్ చక్రవర్తి తన మాటలతో అందరినీ ఉత్తేజ పరిచారు. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రులను, గురువులను ఎన్నటికీ మర్చి పోరాదని, ఏవి కోల్పోయినా చివరికి జీవితాన్ని కోల్పోవాల్సి వచ్చినా వ్యక్తిత్వాన్ని కోల్పోరాదన్నారు. ఈ కళాశాలలోని అన్ని వసతులను ఉపయోగించుకునే హక్కు ప్రతి విద్యార్థిది అన్నారు. ప్రతి పనికి ఒక ప్రామాణిక పద్దతి ఉంటుందని, మహిళలను గౌరవించడం, పుస్తకాలను వాడుకోవడం, ప్రయోగ శాలలను ఉపయోగించడం వంటి వాటిని ఉదాహరణలుగా చెబుతూ ఆ ప్రామాణిక పద్దతిని అనుసరిస్తూ మంచి ఉద్యోగాల్లో స్థిర పడాలని, అందుకు ఈ కళాశాల చక్కటి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఎస్ఆర్ఐటిలో చేరిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ప్రతి కళాశాలకు మౌలిక వసతులు, విద్యార్థులు, విద్యా విషయాలు, ఉద్యోగ నియామకాలు, నాలుగు స్తంబాలుగా ఉంటాయి, ఈ కళాశాలకు ఆ నాలుగు స్తంభాలను పటిష్టంగా నిర్మించడంలో కళాశాల యాజమాన్యం ఆలూరు సాంబశివారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి విజయం సాధించినందుకు ఆనందించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. తమను నమ్మి తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పించినందుకు వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ప్రమాణం చేశారు. వివిధ విభాగాల విద్యార్థిని విద్యార్థులు తమతమ విభాగాల గురించి సబికులందరికీ సంపూర్ణ అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాలకృష్ణ కళశాల సదుపాయాల గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య బాలకృష్ణ, డాక్టర్ సాయిచైతన్య కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ డా.యు.శ్రీనివాసులు, బేస్‌మెంట్ ఆఫీసర్ డా.రంజిత్‌రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశానికి రైతే రాజు

**వ్యవసాయ పనులలో బిజీబిజీగా సర్పంచ్ అంజనేయులు యాదవ్.**

**అనంతపురం రూరల్,జూలై27ప్రభాతవార్త:**



పొలంలో డ్రిప్ పనులలో నిమగ్నమైన రాచానపల్లి సర్పంచ్ అంజనేయులు యాదవ్

అనంత రూరల్ మండలం రాచానపల్లి గ్రామ సర్పంచ్ అంజి నేయులు యాదవ్ వ్యవసాయ పనులలో బిజీబిజీ ఉంటు దాదాపుగా 16 ఎకరాల పొలం ఇత రులతో గుత్తాకు తీసుకుని ఆ పొలంలో విధంగా పంటలు వేయడానికి యంత్రా లతో పనులు చేయించి ఆ పొలంలో డ్రిప్ పనులలో నిమ గ్నం కావడం జరుగు తుంది. గ్రామ సర్పంచ్‌గా గెలిచినప్పటి నుంచి 2024 ఎన్నికల ముందు వరకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహాయ సహకారాలతో గ్రామం తో పాటు సిండికేట్‌నగర్,వివిధ కాలనీలో సిసి రోడ్లు,డ్రైనేజీ కాలువలు ఏర్పా టు చేయడంతో పాటు సిండికేట్‌నగర్,బిఎస్ఆర్ కాలనీలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా శుద్దమైన మంచినీరు అందిం చడం జరుగుతుంది. మొన్న జరిగిన ఎన్నికలలో టిడిపి అధికారంలోకి రావడంతో వైసిపి మద్దతు గెలిచిన సర్పంచ్ కావడంతో ఆయన గ్రామంలో ఏ పనులు చేయాలి అన్న టిడిపి నాయకులు అనుమతితో చేయాలి కనుక గ్రామంలోని అందరితో మంచిగా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తు వ్యవసాయ పనులు చేసుకుంటు బిజీ బిజీగా ఉండడం జరుగుతుందని సర్పంచ్ అంజినేయులు యాదవ్ తెలిపారు.

# డ్రైనేజీలో పూడికతీత పనులు

- ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవతో శుభ్రం అవుతున్న వంకలు



డ్రైనేజీలో పూడికను తీయిస్తున్న దృశ్యం

**అనంతపురం అర్బన్, జులై 27 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఎన్ని ఏళ్లుగా పరిష్కారం కానీ సమ స్యలు పరిష్కారం అవుతాయని టిడిపి డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిఎం లక్ష్మి ప్రసాద్ తెలిపారు. శనివారం నగరంలోని పలు డ్రైనేజీ వంకల్లో పూడిక పేరుకు పోయి 20వ డివిజన్‌సంగమేష్ నగర్ బోయ వీధి వద్ద దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. 20వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జ్ డిఆర్‌పిఎం లక్ష్మి ప్రసాద్ ఆధ్వర్యంలో పూడికతీత పనులను చేపట్టారు. సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పూడిక తీయక పోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చొరవతో ఈ పనులు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కి సంగమేష్ నగర్ బోయ వీధి కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఘనంగా మోహరం వేడుకలు



స్వాముల వారిని ఊరేగిస్తున్న భక్తాదులు.

**పామిడి, జులై 27 ప్రభాతవార్త**

పట్టణంలోని వి.కే.ఆదినారాయణరెడ్డి కాలనీలో ఇమామ్‌ఖాసీం అంగార్వలి మోహరం వేడుకలను పురష్కరించుకుని శనివారం చిన్న పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఇమామ్‌ఖాసీం అంగార్వలి మోహరం వేడుకలను అత్యంతం భక్తిశ్రద్దలతో చేపట్టగా ప్రత్యేక అలంకరణలో ముస్తాబైన స్వాములను భక్తాదులు వేకువజామున పురువీధుల్లో ఊరేగించారు. ప్రతిఏటా ఇక్కడ చిన్న పీర్ల పండుగ వేడుకలను నిర్వహించటం ఆనవాయితీ వస్తుందన్నారు. తప్పెట, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేయగా ప్రజలు స్వాముల వారిని దర్శించుకుని చక్కెర, బెల్లంను చదివిస్తూ తమ మొక్కుబడులను సమర్పించుకున్నారు.

# పనిచేయని స్కూల్ అటెండెన్స్ యాప్...!

**ఉదయం నుంచి సాయంత్రం వరకు అదే పరిస్థితి**

**విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోని వైనం**

**అనంతపురం న్యూటౌన్, జులై 27 ప్రభాతవార్త**




ఓపెన్ కాని స్కూల్ అటెండెన్స్ యాప్

పని రోజు ఉదయం, సాయంత్రం టీచర్ ్, సిబ్బంది అటెండెన్స్, విద్యార్థుల అటెండెన్స్ వేయాలని నిబంధన పెట్టినప్పుడు ఆ యాప్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యాశాఖదే. కానీ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు యాప్ ఓపెన్ కాకపోవడంతో అటెండెన్స్ వేయడానికి టీచర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

అనంతపురం జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్, ప్రభుత్వ, మోడల్‌స్కూల్స్, కేజీబీవీలు, అన్ని రెసిడెన్సియల్ స్కూల్స్ 1737 ఉన్నాయి. ఇందులో దాదాపు 10,500 మంది టీచర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు, 3.60 లక్షల మంది విద్యార్థులు (ఒకటి నుంచి పది వరకు) ఉన్నారు. ప్రతి రోజు టీచర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఉదయం 9 గంటలకు స్కూల్ అటెండెన్స్ యాప్‌లో ఫేషియల్ అటెండెన్స్ వేయాలి. అలాగే విద్యార్థుల అటెండెన్స్ కూడా వేయాలి. ఆన్‌లైన్‌లో అటెండెన్స్ వేయని టీచర్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటుంటారు. అయితే స్కూల్ అటెండెన్స్ యాప్ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సక్రమంగా పని చేయడం లేదని పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా శనివారం స్కూల్స్‌కు వెళ్ళిన టీచర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు యాప్‌లో అటెండెన్స్ వేయడానికి యాప్ ఓపెన్ కాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో చేసేదేమిలేక స్కూల్స్‌లోని అటెండెన్స్‌లో సంతకాలు చేయడం జరిగింది. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు హెచ్‌ఎంలు, టీచర్లు వాపోతున్నారు. ప్రతి రోజు ఉదయం,సాయంత్రం యాప్‌లో అటెండెన్స్ వేయాలని నిబంధన పెట్టినప్పుడు...ఆ యాప్ సక్రమంగా పనిచేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి వుంది. అటెండెన్స్‌ను పర్యవేక్షణ చేయడానికి విద్యాశాఖలో ప్రత్యేకంగా ఐటి సెల్ విభాగం వుంది. కానీ యాప్ ఓపెన్ కాకపోవడంతో టీచర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు అటెండెన్స్ వేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి స్కూల్ అటెండెన్స్ యాప్ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని టీచర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపైన వివరణ అడిగేందుకు వార్త విలేఖరి శనివారం సాయంత్రం 5:02 గంటలకు అనంతపురం డీఈవో బి.వరలక్ష్మికు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు

**CHANGE OF NAME**

I, GUDIBANDA NARAYANAPPA GARI HARSHITH (Old Name) S/o G RAMAPPA H.No. 2-116, KODIKONDA, CHILAMATHRU MANDAL, SRI SATYA SAI DIST. AP. Changing my Name from GUDIBANDA NARAYANAPPA GARI HARSHITH (Old Name) to **HARSHITH G** (New Name). Hence forth I am being called as **HARSHITH G** for all purposes.

**పురపాలక సంఘు కార్యాలయము, ధర్మవరం**

ఆర్.ఓ.సి.నెం.03/2023-ఏ1, తేది : 27-07-2024

**బహిరంగ వేలం ప్రకటన**

ధర్మవరం పురపాలక సంఘ పరిధిలోని కళాజ్యోతి సర్కిల్ నందలి సర్వే నెం.430 నందు నూతనముగా నిర్మించిన షాపు రూములకు గుడ్‌విల్ ప్రాతిపదికన వేలం నిర్వహించడానికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ శ్రీ సత్యసాయి జిల్లా గెజిట్ మేరకు నోటీపై చేయడమైనది.

సదరు షాపు రూములకు గుడ్‌విల్ ప్రాతిపదికన పురపాలక సంఘ కార్యాలయ ఆవరణము నందు ఈ దిగువ తెలిపిన విధముగా షాపు రూములకు బహిరంగ వేలం నిర్వహించబడును. ఇతర సమాచారము కొరకు కార్యాలయ పని వేళలలో రెవిన్యూ విభాగం నందు సంప్రదించగలరు.

**గుడ్ విల్ పద్ధతిపై వేలం వేయు షాపు రూముల వివరములు**

| వేలం తేది | కాంప్లెక్స్ పేరు | సాల్వెన్సీ మొత్తం | ధరావత్తు |
|---|---|---|---|
| 05-08-2024 ఉదయం 11.00 గం॥లకు | కళాజ్యోతి సర్కిల్ నందు గల శ్రీ మాలగుండ్ల పెద్దయ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్ నందు రూము నెం.16 (జనరల్) ఫస్ట్‌ఫ్లోరు నందు రూము నెం. 15 (WS/NB) | 2,50,000/- | 1,50,000/- |

షరతులు :

1. వేలము నందు పాల్గొనువారు డిపాజిట్టు మునిసిపల్ కమిషనరు, ధర్మవరం వారి పేరిట పై తెలిపిన మొత్తమునకు డిమాండు డ్రాఫ్టుతో పాటు సాల్వెన్సీ సర్టిఫికేట్ వేలంకు కనీసం ఒక రోజు ముందు సమర్పించవలెను.
2. వేలము నందు పాల్గొనువారు ఇంటి పన్నులు, నీటి కొళాయి పన్నులు బకాయి లేకుండా చెల్లించి ఉండవలెను.
3. వేలం నందు పాల్గొనువారు లీజు గెజిట్‌లోని షరతులకుబద్దుడై ఉండవలెను.
4. వేలము వాయిదా వేయుటకు మరియు రద్దు పరచుటకు కమిషనరు గారికి పూర్తి అధికారము కలదు.

సం/- కమిషనరు, ధర్మవరం పురపాలక సంఘం

# రాష్ట్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సి

## - అమరాపురంలో వక్క మార్కెట్ ఏర్పాటుకు వినతి



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**అమరాపురం, జూలై 27 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అమరాపురంలో వక్క రైతుల కోసం వక్క మార్కెట్ నిర్మాణానికి కృషి చేయాలని వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖామంత్రి కింజరపు అచ్చెన్నాయుడును కలిసి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్‌సి గుండుమల తిప్పేస్వామిలు వినతిపత్రం అందచేశారు. నియోజకవర్గానికి గుర్తింపు పొందిన పట్టు రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలను గతంలో తేదేపా హయాంలో ఇచ్చిన విధంగా మరలా ఇవ్వాలని, అలాగే ఎంపిఇఒలుగా విధులు నిర్వహిస్తున్న వారిని అంతర్ జిల్లా బదిలీల నుండి తప్పించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర హోంమంత్రి అనితను కలిసి మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో, మడకశిర అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఖాళీగా వున్న పోస్టులతో పాటు మారుమూల పోలీసుస్టేషన్లలో వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వారు కోరారు. తగిన పోలీసు సిబ్బందిని కేటాయించాలని అదేవిధంగా వాహనాలను కూడా కేటాయించాలని వారు కోరారు.

# ఇబ్బంది లేకుండా హెచ్.ఎల్.సి ద్వారా నీటి సరఫరా... జిల్లా కలెక్టర్



హెచ్ఎల్‌సి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**కణేకల్లు, జూలై 27 ప్రభాతవార్త:**

ఇబ్బంది లేకుండా హెచ్ఎల్‌సి ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఐఏఎస్ పేర్కొన్నారు. శనివారం సాయంకాలం మండల కేంద్రం వద్ద ఉన్న చిక్కణ్ణేశ్వర చెరువును ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సి ద్వారా విడుదల చేసిన జలాలు పిఏబిఆర్ డ్యాంకు చేరుతున్నాయన్నారు. జిల్లాలో ఆగస్టు రెండో వారంలో జిల్లా ఇరిగేషన్ కన్సల్టేషన్ కమిటి సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని శాసనసభ్యులతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేస్తామని, జిల్లాకు హెచ్ఎల్‌సి నీటి రాకలో ఎలాంటి ఇబ్బంది ఈ సారి ఉండదని, కర్ణాటకలోని అగుంబే, శివమొగ్గ, ధావనగేర, బళ్లారి ప్రాంతాల్లో వర్షాలు బాగా పడడం వల్ల తుంగభద్ర డ్యాం నిండిందన్నారు. డ్యాం నిండడంతో జిల్లాకు కేటాయించిన 26టిఎంసిల జలాలు వస్తాయనే అనుకూల బావంతో ఉన్నామన్నారు. జిల్లాలో హెచ్ఎల్‌సి కింద ఉన్న 1.4లక్షల ఎకరాలకు, వీలైతే కర్నూలు జిల్లాలో ఉన్న 20వేల ఎకరాలకు నీరు ఇవ్వగలుగుతామని ఇంజనీర్లు తెలియజేశారన్నారు. నీటి సరఫరాలో ఎక్కడ ఇబ్బంది లేకుండా అప్పుడప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం జరుగుతుందన్నారు. తాగునీటి కోసం ఎక్కడైనా డిమాండ్ ఉంటే దానిని గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తుంగభద్ర డ్యాం నుంచి ఇక్కడికి ఎంత దూరం ఉంది, ఆయకట్టుకు నీరు వదిలారా, హెచ్ఎల్‌సి కింద ఎంత వరకు నీరు ఇవ్వగలుగుతారు, చెరువులో ఎంత నీరు నిల్వ ఉంది, ఎన్ని రోజులు నీరు వస్తుంది తదితర వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎల్‌సి ఎస్ఈ రాజశేఖర్, డిఈఈ మద్దిలేటి, ఈఈ రమణారెడ్డి, ఏఈఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను నాటడం పవిత్రమైన బాధ్యత

## - హరిత అనంత సాకారం దిశగా చెట్లను విస్తృతంగా నాటాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్





మొక్క నాటుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ , మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



పాల్గొన్న విద్యార్థులు

**అనంతపురం కలెక్టరేట్, జూలై 27 ప్రభాతవార్త**

పవిత్రమైన బాధ్యతగా చెట్లను నాటడం చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని రెండవ రోడ్డులో వున్న పొట్టి శ్రీరాములు నగరపాలకోన్నత పాఠశాలలో శనివారం ఏజిఎస్ ఫౌండేషన్ చేపట్టిన ఉచిత చెట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం మొదలైంది ని జిల్లాలో విస్తృతంగా మొక్కల పెంపకం కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. ఏజిఎస్ ఫౌండేషన్ తరుపున అందించిన ఉచిత మొక్కలను విద్యార్థులంతా ఇంటికి తీసుకెళ్లి చెట్లను నాటి జాగ్రత్తగా పెంచుకోవాలన్నారు. మొక్కలు నాటే ప్రక్రియను పవిత్రమైన పనిగా చేపట్టాలన్నారు. చెట్లను సరిగా నాటాలని, చెట్లు నాటడం వల్ల కలిగే మంచిని, ఏమేమి లాభాలు వున్నాయి అనేది విద్యార్థులకు తెలియచేయాలన్నారు. తల్లితో పాటు చెట్టు మీకు సేవ చేస్తుందని, చెట్లతో రిలేషన్‌షిప్ వుంచుకోవాలన్నారు. హరిత అనంత సాకారం దిశగా చెట్లను విస్తృతంగా నాటాలని, ఎక్కడ అవసరం వుందో అక్కడ చెట్లు నాటాలన్నారు. విద్యార్థులందరికీ మంచి ఆరోగ్యం, విద్య అందించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు చెట్లను పంపిణీ చేసి చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటి మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ పివిఎస్ఎన్ మూర్తి, పాఠశాల హెచ్ఎం రమేష్‌బాబు, ఏజిఎస్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ఫౌండర్ ప్రమీలమ్మ, ఆమె కుమారుడు డిస్కవర్ ఏటిపి అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి**

కమిషన్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అమరావతి నుంచి శ్రీహరి కిరణ్ రాష్ట్రస్థాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు, ప్రోగ్రామ్ అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలకు సంబంధించి తగు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత వర్షాకాలం కావడంతో కీటక జనిత వ్యాధులు సంబంధించి డెంగ్యూ, మలేరియా మొదలగు దోమ కాటు వల్ల ప్రబలే వ్యాధుల నివారణ కోసం జిల్లాస్థాయి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా కుష్టు వ్యాధి నివారణలో భాగంగా జరుగుతున్నటువంటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24/7 వైద్య సేవలు అందించాలని తెలియజేశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా గర్భిణీ స్త్రీలకు ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈబి దేవి ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ, జేమ్స్ డాక్టర్ నారాయస్వామి, మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ అధికారి మహ్మద్ రఫీ డెమో త్యాగరాజు, గంగాధర్ సుబ్రహ్మణ్యం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# శరవేగంగా అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులు

**గుత్తి, జూలై 27 ప్రభాతవార్త**



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పేదలకు కడుపునిండా భోజనం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పట్టణంలోని అన్న క్యాంటీన్ భవన పునర్ నిర్మాణం పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆగస్టు 15న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే జయరాం, ఇన్‌చార్జ్ నారాయణ పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయి. మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు, డిఇ హేమచంద్రులు భవనపు పనులను పర్యవేక్షించారు. క్యాంటీన్ అందుబాటులోకి వస్తే 5 రూపాయలకే టిఫెన్, భోజనం పేదలకు అందనుంది. కాగా ఆంర్అండ్‌బి అతిథిగృహం ప్రహరీలో క్యాంటీన్ అప్పట్లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఇ హరికిషన్, ఆర్ఐ రామాంజినేయులు, సుధాకర్, టిడిపి నాయకులు ఎన్‌కె చౌదరి, చెరుకూరి లక్ష్మణ్, బోర్‌వెల్ నాగరాజు, సత్యనారాయణగౌడ్, భాస్కర్‌స్వామి, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్‌యార్డును ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్...

## మార్కెట్‌యార్డులో మొక్కలు నాటిన కలెక్టర్...



మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్

**రాయదుర్గం, జూలై 27 ప్రభాతవార్త:**

పట్టణంలోని మార్కెట్‌యార్డును శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఐఏఎస్ ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు లో చేపడుతున్న కార్యకలాపాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఏపి మార్కెట్ యార్డులు యాక్టివ్‌గా పని చేస్తున్నాయి, చెక్ పోస్టులలో మార్కెట్ పీజులు వసూలు చేస్తున్నారా తదితర వివరాలను మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మార్కెట్‌యార్డు ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి, మార్కెట్‌యార్డు సెక్రెటరి శ్రీనివాసులు, సిఐ శ్రీనివాసులు, తహాసీల్దార్ చిట్టిబాబు, మార్కెట్‌యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే మన అందరి బాధ్యత -డిఇఒ మీనాక్షి





మొక్క నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిఇఒ , మాట్లాడుతున్న డిఇఒ మీనాక్షి

**లేపాక్షి, జూలై 27 ప్రభాతవార్త**

నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన బాధ్యత మనందరిపై వుందని డిఇఒ మీనాక్షి విద్యార్థులకు సూచించారు. శిక్షా సప్తాహ్, పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్రలోభాగంగా శనివారం ఎంజెపిగురుకుల పాఠశాల, జవహర్ నవోదయ విద్యాలయం, కెజిబివి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని డిఇఒ మీనాక్షి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో డిఇఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసాన్ని అభ్యర్థించాలన్నారు. నాణ్యమైన విద్యను అభ్యసించిన రోజునే ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం వుంటుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రతి తరగతిలోనూ చక్కగా విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రస్తుతం పచ్చదనాన్ని హరించే వారు అధికమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి 35 మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. పచ్చని చెట్లను నరికే సమయంలో సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సిన బాధ్యత కూడా విద్యార్థులు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు, ఇంటి పరిసరాల్లోనూ మొక్కలు నాటాల్సిన బాధ్యత మనపై వుందని డిఇఒ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు, ఎంఇఒ-2 కుళ్లాయప్ప, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుందర్‌రాజ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్‌లో గౌరవాధ్యక్షునికి ఘనసన్మానం



సీనియర్ జర్నలిస్టును సన్మానిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూలై 27 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన లేపాక్షిలో సీనియర్ పాత్రికేయుడు హిందూపురం ప్రెస్‌క్లబ్ శాశ్వత గౌరవాధ్యక్షునిగా లేపాక్షి రాంప్రసాద్ ఎన్నికైనందున శనివారం లేపాక్షి పాత్రికేయుల తరుపున ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. లేపాక్షి పాత్రికేయ మిత్రులకు ఎల్లవేళలా అండగా వుండాలని విలేకరులు కోరారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షిలో పర్యాటక కేంద్రంగా వుందని ఇలాంటి ప్రాంతంలో విలేకరులందరూ ఐకమత్యంగా వుంటే భవిష్యత్తులో అతి త్వరలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తానని రాంప్రసాద్ తెలిపారు. వారం రోజుల లోపల హిందూపురం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ప్రెస్‌క్లబ్ సభ్యులందరీని ఆహ్వానించి పెద్దఎతుతన సత్కార సభ నిర్వహించే విధంగా లేపాక్షి పాత్రికేయులు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి జర్నలిస్టులు, నాయకులు గోవర్ధన్, సుబ్బరాయుడు, శివ, ఆనందప్ప, సందీప్, అశోక్, నటేష్, వైస్ఎంపిపి అంజన్‌రెడ్డి, గ్రామస్తులు రామాంజినేయులు, వీరన్న, హనుమంతు, లక్ష్మినారాయణరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మైదుగోళం మురళిరెడ్డి, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

## - విద్యార్థులకు రూ,5.70 లక్షల అందజేత - ఆర్య ఈడిగ గౌడ సంఘం





పురస్కారం అందిస్తున్న హరి, శేఖర్ దంపతులు , పెద్దసంఖ్యలో హాజరైన ఈడిగ గౌడ కులస్తులు

**హిందూపురం, జూలై 27 ప్రభాతవార్త**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చక్కటి విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక ఈడిగ ప్యాలెస్‌లో సంఘం అధ్యక్షులు జిఆర్ శేఖర్‌గౌడ్, తదితర కమిటీ సభ్యుల నేతృత్వంలో శనివారం శ్రీసత్యసాయి జిల్లాలో ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ప్రతిభా పురస్కారాల నగదు అందజేత కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షులు కిరన్‌కుమార్‌గౌడ్, జి.రామకృష్ణప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ ఈడిగ కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి వున్నారని ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈడిగ కులస్తుల్లో ఆర్థికంగా స్తోమత కలిగిన వారు పేద విద్యార్థుల ఉన్నత చదువు కోసం ఆర్థిక చేయూతను మరింత మంది ముందుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 27 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున 10వతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 60 మందికి 5 వేల రూపాయల చొప్పున మొత్తం 5.70 లక్షల రూపాయలను ప్రదానం చేశారు. కాగా ఇంటర్మీడియట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్ తన సొంత ఖర్చుతో మూడు లాప్‌టాప్‌లను పంపిణీ చేయడం విశేషం. కదిరి నుండి వచ్చిన గిరిజమ్మ 50 వేల రూపాయలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌మాజీ కౌన్సిలర్ హరినాథ్‌గౌడ్, దేమకేతేపల్లి వెంకటనారాయణ, ఆదిమూర్తి, దేవేంద్రప్ప, పుల్లారెడ్డి, కమిటీ కార్యదర్శి వినయ్, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, లక్ష్మీపతి, రవి, తిరుమలేష్, సెబ్ సిఐ రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పొలమరాజుల ఆలయానికి వెళ్లే రహదారిలో ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూలై 27 ప్రభాతవార్త**

మండలంలోని బింగిపల్లి గ్రామ సమీపంలో వెలసిన పొలమరాజుల ఆలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా వున్న ముళ్ల పొదలను సర్పంచు ఆదినారాయణ, వైస్ఎంపిపి అంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఈ నెల 30వతేదీన పొలమరాజులు, సప్పలమ్మ జాతర నేపథ్యంలో ఆయాల పరిసరాలను సర్పంచు, వైస్ఎంపిపిల ఆర్థిక సహకారంతో శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో జరిగే దైవ కార్యక్రమాలతో పాటు ధార్మిక కార్యక్రమాలకు తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ బషీర్, నాయకులు సయ్యద్‌నిసార్‌అహ్మద్, శ్యాంప్రసాద్‌రెడ్డి, నరస, ఇర్ఫాన్, బింగిపల్లి నాయకులు భాస్కర్‌రెడ్డి, టైలర్ వేణుగోపాల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మేంబర్ గంగాధరప్ప, ప్రసాద్‌రెడ్డి, నంజుండప్ప, ఆనంద్, లక్ష్మినారాయణప్ప, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థసేవలకు ప్రతిరూపం డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం

## -తెదేపా రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్యదర్శి మహమ్మద్ రఫి



అలనాడు దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో మహమ్మద్ రఫి (దాచిన చిత్రం)

**పుట్టపర్తి, జులై 27, ప్రభాతవార్త**

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం డా.ఎ.పి.జె.అబ్దుల్‌కలాం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫి కొనియాడారు. శనివారం మాజీ రాష్ట్రపతి, భారత దేశ అణుపితామ హుడిగా ఖ్యాతినొం దిన డా.ఎ.పి.జె.అబ్దుల్‌కలాం 7వ వర్ధంతి సందర్భంగా ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, భారత దేశ యువతకు కలాం దార్శనికుడని, దేశం కోసం తన జీవితాన్ని ధారపోశారని, రాష్ట్రపతిగా, అణ్వాయుధ శాస్త్రవేత్తగానే కాకుండా హృద్రోగుల కోసం ఆయన రూపొందించిన వైద్యపరికరాలతో సైతం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. గతంలో పుట్టపర్తి విమానాశ్రయం నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, మాజీమంత్రి వర్యులు పల్లె రఘునాథ్‌రెడ్డి, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్‌ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌లతో కలసితాను దివంగత అబ్దుల్ కలాంగారిని సత్కరించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

# వైసిపి కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

**హిందూపురం టౌన్, జూలై 27 ప్రభాతవార్త**

హిందూపురం మండలం గొల్లపురం గ్రామంలో ఇటీవల టిడిపి వర్గీయుల దాడిలో మృతి చెందిన వైసిపి కార్యకర్త సతీష్ కుటుంబానికి శనివారం వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త దీపిక, వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్‌నిశ్చల్‌లు అధిష్టానం పంపిన 5 లక్షల రూపాయల పరిహారం చెక్కును బాధితులకు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు పార్టీ అధిష్టానం ఎప్పుడూ అండగా వుంటుందని వారు తెలిపారు.



బాధితులకు నగదు అందచేస్తున్న దీపిక, నవీన్‌నిశ్చల్